సాక్షి సూర్యాపేట

సోమవారం ◆ 6 ◆ ఫిబ్రవరి ◆ 2023



మహాసౌరహోమం

తిమ్మాపురంలోని మహాసూర్యక్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు.

- 8లో



కనులపండువగా చక్ర తీర్థం

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.

- 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33°/17°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ప్రజావాణి రద్దు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అధికారులు పెద్దగట్టు జాతర విధుల్లో ఉన్నందున సోమవారం జరిగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి రాజేంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులు గమనించాలని, తదుపరి సోమవారం ప్రజావాణి యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

చివ్వెంల (సూర్యాపేట) : లింగమంతుల స్వామి జాతర నిర్వహణలో జరిగిన అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం దురాజ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జాతర పేరుతో కోట్ల రూపాయలు తన అనుచరులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. గత మూడు జాతరల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాటు గుట్టపై వచ్చిన ఆదాయంపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. జాతరలో విద్యుత్ పేరుతో రూ.కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. జాతర కాంట్రాక్టులు బీఆర్‌ఎస్ నాయకులకు కేటాయించి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, జిల్లా అధికార ప్రతినిధి ఐతగాని జానయ్య గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దె బోయిన శ్రీనివాస్, జిల్లా నాయకులు వాజిద్ మీయా, వలపట్ల మహేష్, మీర్ అక్బర్, కొప్పుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

15 దరఖాస్తుల తొలగింపు

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల బదిలీల కోసం ఈ నెల 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే జిల్లా వ్యాప్తంగా బదిలీల కోసం ఆన్‌లైన్‌లో 2419 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. ధ్రువపత్రాలను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు సరైన పత్రాలు సమర్పించని వాటిని, ఇతర కారణాలతో 15 దరఖాస్తులను తొలగించారు. కాగా. 2404 దరఖాస్తులను బదిలీల కోసం స్వీకరించారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : పంచనారసింహుడు కొలువైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్య కైంకర్యాలు నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకారమండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడుసేవలు, ముఖ మండపంలో సువర్ణపుష్పార్చన గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్యా.. దీవించయ్యా



వైభవంగా ప్రారంభమైన గొల్లగట్టు జాతర

- ఓ లింగా నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు
- కేసారంలో దేవరపెట్టెకు మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు
- అర్ధరాత్రి దాటిన తర్వాత గట్టుకు చేరిన దేవరపెట్టె
- లింగన్న ఆలయం చుట్టూ గంపల ప్రదక్షిణ



చివ్వెంల మండలం దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి ఆలయం చుట్టూ మంద గంపలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



చివ్వెంల, దురాజ్‌పల్లి, సూర్యాపేట రూరల్: గజ్జెల లాగుల గలగలలు, కటారు విన్యాసాలు, భేరీ చప్పుళ్లు, భక్తుల పూనకాలు, లింగా.. ఓ లింగా నామస్మరణతో పెద్దగట్టు మార్మోగింది. తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మందగంపల ప్రదక్షిణతో ప్రారంభమైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో కీలక ఘట్టమైన దేవరపెట్టె (అందనపు చౌడమ్మపెట్టె) తరలింపు కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. సూర్యాపేట మండలంలోని కేసారం గ్రామంలో దేవరపెట్టె వద్ద దేవతా విగ్రహాలకు మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. పెట్టెను మోసి తరలింపును ప్రారంభించారు. అంతకుముందే తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం గొర్ల, మెంతబోయిన వంశస్తుల ఇంటి నుంచి వెళ్లే బోనం బియ్యం, లింగమంతుల స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను మంత్రి సమర్పించారు. కేసారం గ్రామ వీధుల్లో దేవర పెట్టె ఊరేగింపు కనులపండువగా సాగింది. మహిళల కోలాటాలు, భేరీలు, గజ్జెల చప్పుళ్లు, కత్తులు, కటారుల విన్యాసం, భక్తుల జయజయధ్వానాల నడుమ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దేవరపెట్టె పెద్దగట్టుకు చేరుకుంది. భక్తులు రాత్రి తమ ఇళ్లలో గంపలు వెళ్లదీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సంప్రదాయ ఆయుధాలు తీసుకుని తెల్లవారేలోపే పెద్దగట్టుకు చేరుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీపీ రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ, శ్రీనివాస్ నాయుడు, గొర్ల గన్నారెడ్డి, రమణారెడ్డి, మద్ది శ్రీనివాస్‌యాదవ్, జటంగి నాగరాజు, పచ్చిపాల అనిల్, మెంతబోయిన నాగయ్య శ్రీకృష్ణ ట్రస్ట్ కమిటీ చైర్మన్ ఊర రామ్మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

తొలిరోజే భక్తుల సందడి..

యాదవుల సంప్రదాయ పండుగ లింగమంతుల స్వామి జాతర మొదటి రోజు ఓ లింగ నామస్మరణాలతో మార్మోగింది. మొదటి రోజు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సుమారు 60-70 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలు, సొంత వాహనాల్లో పెద్దగట్టుకు తరలివచ్చారు. యాదవులు సంప్రదాయ దుస్తుల్లో డోలు వాయిద్యాలు, కటారు విన్యాసాలు, భేరీ చప్పుళ్లు చేసుకుంటూ గుట్టపైకి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలలో నైవేద్యం వండి స్వామివారికి సమర్పించారు. సంప్రదాయం ప్రకారం ఆలయం పక్కన ఉన్న ప్రహరీ గోడకు నైవేద్యాన్ని విసిరికొట్టి భక్తి చాటుకున్నారు. కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి తమ కోరికలు తీర్చాలను వేడుకున్నారు.



లింగమంతుల స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

జాతర వద్ద సౌకర్యాలు..

జాతరవద్ద భక్తుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను, పోలీస్ సహాయక కేంద్రాలను, హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారు. జాతరలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆదివారం ప్రారంభం కాకపోవడంతో జారతకు వచ్చిన భక్తులు కొంత మేరకు నిరాశచెందారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

పెద్దగట్టు జాతర నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకట్రావ్ తెలిపారు

మంద గంపల ప్రత్యేకత..

యాదవుల సంప్రదాయం ప్రకారం.. హక్కుదారులైన మున్న, మెంతబోయిన వంశ మహిళలు మంద గంపలను నెత్తిన పెట్టుకుని జాతరకు వస్తారు. మందగంపలు, దేవరపెట్టెతో కలిసి ఊరేగింపుగా వచ్చి లింగమంతుల స్వామి, చౌడలమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ముందుగా వీరు తమ ఇంట్లో దేవరముందు కొత్త గంపలో పసుపు, కుంకుమ, నూనె, అగరు బత్తీలు, గుగ్గిలం, మైశాచి, హారతి కర్పూరం, పోకలు, ఖర్జూరలు, కొబ్బరి కాయలు, జీడి గింజలు, పాలు, పెరుగు, నెయ్యి, రవిక పూజా సామగ్రితో పాటు, బియ్యం, కారం, ఉప్పు, ఉల్లిగడ్డలు, ఎల్లిపాయలు, కత్తి మొదలైన వంట సామగ్రి పెడతారు. దీంతో పాటు జీవాల మందలో నుంచి జాతర కోసం ఓగొర్రెను స్వామివారి పేరిట బలిచ్చేందుకు తీసుకొస్తారు. మళ్లీ రెండేళ్లకు వచ్చే జాతర కోసం మందలోని మరో చిన్న పొట్టేల్ పిల్లకు బొట్టు పెట్టి వస్తారు. దీనివల్ల తమ పశువులు, గొర్లు, మేకలు వృద్ధి చెందుతాయని వారి నమ్మకం. జాతరకు తీసుకొచ్చిన గంపను ఇంట్లో భద్రపరిచి మళ్లీ వచ్చే జాతరకు దానికి వినియోగిస్తారు.



పెద్దగట్టు జాతరకు ట్రాక్టర్‌లో తరలివస్తున్న భక్తులు

నేడు మంత్రుల రాక

పెద్దగట్టు జాతరకు సోమవారం రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రానున్నారు. లింగమంతుల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కూడా పెద్దగట్టుకు వచ్చి పూజలు చేయనున్నారు.

విద్యుత్ దీపాల వెలుగుల్లో పెద్దగట్టు



పల్లెలకు నిధులు

- జిల్లా వ్యాప్తంగా రూ.35.60 కోట్ల ఉపాధి హామీ నిధులు మంజూరు
- గ్రామాల్లో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు
- మార్చి నెలాఖరికల్లా పనులు పూర్తి చేసేలా అధికారుల కసరత్తు

చిలుకూరు: జిల్లాలోని 17 మండలాలకు గాను సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీల నిర్మాణాలకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నుంచి రూ.35కోట్ల 60 లక్షల నిధులు మంజూరు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వీటికి కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరి కల్లా ఈ రోడ్లు పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు.

పూర్తికావచ్చిన తీర్మానాలు

సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంలో మండల స్థాయిలో ఎంపీడీఓ, పీఆర్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామ పంచాయతీ తీర్మానంతో పనులు చేయాల్సి వస్తుంది.

మండలాల వారీగా నిధులు (రూ.కోట్లలో)

కోదాడ	1.45	చివ్వెంల	3.40
చిలుకూరు	1.20	హుజూర్‌నగర్	2.40
మోతె	1.95	చింతలపాలెం	1.40
అనంతగిరి	1.45	గరిడేపల్లి	2.40
మునగాల	1.30	మేళ్లచెర్వు	1 కోటి
నడిగూడెం	1.30	నేరేడుచర్ల	1.30
సూర్యాపేట	3.15	పాలకీడు	1.10
పెన్‌పహాడ్	4.10	మఠంపల్లి	2 కోట్లు
ఆత్మకూర్	4.25	మొత్తం	000



చిలుకూరులో వేస్తున్న సీసీ రోడ్డు

జిల్లాలో ఈ తీర్మానాలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఇదిలా ఉండగా.. జిల్లాలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు తమ వాటాల కోసం తిరకాసులు పెడుతున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్మాణాలు చేపట్టనున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు ఉండగా 15 రోజుల కిందటే రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

గతంలో బిల్లులు జాప్యం కావడంతో..

మార్చి గడువుకు రెండు నెలలు మాత్రమే ఉంది. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ దిశగా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. కానీ గతంలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం నెలకొనడంతో ఈ ఏడాది పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అభివృద్ధి పనులకు నిధుల్లేవని చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉన్న వాటిని ఖర్చు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో గడువులోపు పనులు పూర్తయ్యేది గగనమే అని పలువురు పేర్కొంటున్నారు.

మళ్లీ బయోమెట్రిక్ హాజరు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులకు అమలు
- ఇష్టానుసారం విధులకు చెక్
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు కూడా అమలు



కాలేజీలో బయోమెట్రిక్ యంత్రంతో వేలిముద్రలు వేస్తున్న అధ్యాపకులు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానం మళ్లీ పట్టాలు ఎక్కేందుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ పద్ధతిని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలల్లో పగడ్బందీగా అమలు చేస్తుండటంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో కూడా అమలు చేయాలని సంకల్పించింది.

2016- 17లోనే బయోమెట్రిక్ విధానం

బయోమెట్రిక్ విధానం 2016-17 విద్యా సంవత్సరంలోనే అమలు చేశారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి అధునాతన హాజరును ప్రవేశపెట్టారు. కొన్ని చోట్ల బయోమెట్రిక్ యంత్రాలు కొద్ది రోజులకే మొరాయించడం, నిర్వహణలో సాంకేతిక లోపాల వంటివి తలెత్తాయి. ఈ క్రమంలో మూడేళ్లపాటు కరోనా వైరస్ కారణంగా ప్రత్యక్ష తరగతులు నిలిచి పోయాయి. దీంతో బయోమెట్రిక్ హాజరు నిలిచిపోయింది. ఆ యంత్రాలు వినియోగంలో లేకపోవడం, కాలపరిమితి ముగియడంతో ఈ విధానాన్ని గతేడాది నుంచి పూర్తిగా పక్కన పెట్టారు.

జిల్లాలోనే 7 జూనియర్ కళాశాలల్లో..

సూర్యాపేట, నెమ్మికల్, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, నడిగూడెంలలో 7 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 203 మంది విధులు నిర్వహిస్తున్నారు. వారిలో బోధన సిబ్బంది 148 మంది ఉండగా బోధనేతర సిబ్బంది 55 మంది ఉన్నారు. వీరంతా ఇక నుంచి బయోమెట్రిక్ ద్వారానే హాజరు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లాలోని 7 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటికే ఈ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. వాటికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కూడా కేటాయించారు. తొలి విడతగా ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది వేలిముద్రల నమోదు పూర్తి చేశారు. ట్రయల్స్ కూడా విజయవంతంగా నిర్వహించారు. ఇక నుంచి వీరంతా బయోమెట్రిక్ వినియోగించాల్సి ఉంటుంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు కూడా బయోమెట్రిక్ అమలు చేసేలా ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

బోధన తీరు క్రమంగా మెరుగు..

జిల్లాలోని పలు కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు రోజువారీగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో కొందరు ఇష్టానుసారంగా విధులకు హాజరు అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలువురు సమయపాలన పాటించకపోవడంతో తరగతుల నిర్వహణకు తరుచూ ఇబ్బంది కలుగుతోంది. మరికొందరు తరుచూ బయటకు వెళ్లడం, సొంత పనులు చక్కదిద్దుకు రావడం జరుగుతుంది. అయితే బయోమెట్రిక్ విధానం అమలుతో బోధన తీరు క్రమంగా మెరుగుపడుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

ఇక నుంచి వేలిముద్రలతోనే హాజరు



జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ యంత్రాలు పనిచేసేలా అన్ని ఏర్పాట్లు చేశాం. ఇక నుంచి వేలిముద్రలతోనే హాజరు నమోదు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఈ విధానం అమలు చేస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు కూడా బయోమెట్రిక్ అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

పేదల సొంతింటి కల ప్రభుత్వమే నెరవేర్చాలి



మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వ్యవస్థ రద్దు, దేవాలయ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన వాగ్దానాలు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ హామీ నేడు అపహాస్యం పాలయిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌తో సీపీఐ పొత్తు కేవలం ఎన్నికల వరకు మాత్రమేనని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ధూళిపాళ ధనుంజయ నాయుడు, మండవ వెంకటేశ్వర్లు, ఉస్తేల నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

కోదాడలో 50వేల మెజార్టీతో గెలుస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో కాంగ్రెస్ పార్టీ 50 వేల మెజార్టీతో గెలుస్తుందని, ఈ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్‌లో భాగంగా ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో ఇటీవల జరిపిన సర్వేలో కూడా అధికార పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ 25 శాతం అధిక ఓట్లను తెచ్చుకోబోతుందని తేలిందని చెప్పారు. ప్రతి వంద ఓట్లలో 58 మంది కాంగ్రెస్‌కు, 35 మంది ఇతర పార్టీకి ఓట్లు వేయనున్నారని పేర్కొన్నారు. 30 సంవత్సరాలుగా కోదాడ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన భారత్‌జోడో యాత్ర విజయవంతమైందని, ఈ కార్యక్రమం ప్రారంభంలో, ముగింపులో తాను భాగస్వామిని కావడం ఆనందంగా ఉందని తెలిపారు. జోడో యాత్ర సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గడగడపకు తీసుకెళ్లాలని కోరారు. ఈ నెల 6 నుంచి రెండు నెలల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సీనియర్ నాయకుడు నిరంజన్, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, లక్ష్మీనారాయణరెడ్డి, రామారావు, సీతయ్య పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తజనం



జాతరలో కంట్రోల్ రూమ్ వద్ద ఎస్పీ రాజేంద్రప్రసాద్ పక్కన డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్‌రెడ్డి

నిఘా నీడలో పెద్దగట్టు

జాతరకు లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. పోలీస్ సిబ్బంది నిరంతరం గస్తీగాస్తూ పర్యవేక్షిస్తున్నారు. జాతరలో గట్టు చుట్టూ 44 సీసీ కెమరాలను ఏర్పాటు చేసి పోలీస్ కంట్రోల్ రూంలో సీసీ కంట్రోల్ యూనిట్‌ను ఉంచి పర్యవేక్షిస్తున్నారు.



వాకీటాకీలో మాట్లాడుతున్న ఎస్పీ

జాతరలో బందోబస్తును పరిశీలించిన ఎస్పీ

జాతరలో ఎటువంటి ఘటనలు జరగకుండా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదివారం ప్రత్యేక చొరవ చూపుతూ బందోబస్తు పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై పాటించాల్సిన నియమ నిబంధనలను పోలీసులకు వివరించారు. అదే విధంగా కంట్రోల్ రూమ్ కొంత సేపు కూర్చొని వాకీ టాకీతో పర్యవేక్షణ చేశారు.

ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు

భక్తులకు ప్రమాదవశాత్తు ఎలాంటి సంఘటనలు జరిగిన ప్రథమ చికిత్స నిర్వహించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎనిమిది ప్రదేశాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద డాక్టర్లతో పాటు ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బందిని నియమించారు.



జాతర వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది



గంపలతో లింగమంతుల స్వామి ఆలయానికి వస్తున్న భక్తులు

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు
- వివిధ శాఖల ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పన

దురాజ్‌పల్లి/చివ్వెంల : రెండేళ్లకు ఒక సారి వచ్చే లింగమంతుల స్వామి జాతరకు భక్తులు మొదటి రోజే భారీగా తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల భక్తులు తమ కుటుంబీకులు, బంధువులతో కలిసి జాతరకు తరలివచ్చారు.

హంగులతో ఎగ్జిబిషన్

లింగమంతుల స్వామి ఆలయ సమీపంలో హంగులతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశా రు. ఎగ్జిబిషన్ పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో రాలే దు. దీంతో ఆదివారం ఎగ్జిబిషన్ నడవకపోవడంతో భక్తులు కాస్త నిరాశ చెందారు.

తాగునీటికి భగీరథ...

జాతరలో భక్తుల తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు మిషన్ భగీరథ పథకం ద్వారా ఏర్పాట్లు చేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో కుళాయిలను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. జాతర పరిసర ప్రాంతాల్లో 12చోట్ల తాగునీటి కుళాయిలు, నీటి తొట్లను ఏర్పాటు చేశారు.

పార్కింగ్ సౌకర్యం

జాతరకు వచ్చే భక్తులు తమ వెంట తీసుకొచ్చే వాహనాలకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించారు. జాతర పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు భక్తుల వాహనాలకు అక్కడ ఉచితంగా పార్కింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

నెట్‌వర్క్ పెంపునకు తాత్కాలిక టవర్

జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక నెట్‌వర్క్ టవర్‌ను ఏర్పాటు చేశారు. గత జాతరలో భక్తులు అధిక సంఖ్యలో రావడం, సెల్‌ఫోన్లు కలవకపోడంతో చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని నెట్‌వర్క్‌ను పెంచుతూ తాత్కాలిక టవర్‌ను ఏర్పాటు చేశారు.





ప్రత్యేక అలంకరణలో శ్రీ లింగమంతుల స్వామి మాణిక్యమ్మ, ఆకుమంచమ్మ

అందుబాటులో అత్యవసర సేవలు

ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు, షార్ట్‌సర్క్యూట్ వంటివి సంభవిస్తే అరికట్టడానికి జాతరలో అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచారు. అదే విధంగా 108, 104 వాహనాలను జాతర వద్ద అందుబాటులో ఉంచారు. జాతర నిరంతరం రద్దీగా ఉండనుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరగనున్నదో తెలియని పరిస్థితి, నివారణకు అత్యవసర సేవలు అందుబాటులో ఉంచారు.



అత్యవసర సేవలకు ఏర్పాటు చేసిన 108 వాహనం



మెట్టు మెట్టుకు బొట్టు పెడుతున్న భక్తులు

మెట్టుకు బొట్టు..

కోరిన కోర్కెలు తీరాలని స్వామి వారిని స్మరించుకుంటూ ఆదివారం పలువురు భక్తులు లింగమంతుల స్వామిని ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న ప్రతి మెట్టుకు బొట్టు పెడుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు డాగ్ స్క్వాడ్ బృందంతో అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. ప్రజలు జాతరలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆకర్షణగా ఫొటో ఎగ్జిబిషన్..

జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖ ఆధ్వర్యంలో జాతరలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకర్షణగా నిలిచింది. పర్యాటక ప్రదేశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఆదివారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్‌ఓ రాజేంద్రకుమార్ ఇతర అధికారులతో కలిసి ఎగ్జిబిషన్‌ను తిలకించారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సహాయ కేంద్రం ఏర్పాటు

జాతరకు అధిక సంఖ్యలో భక్తులు రానుండడంతో చిన్న పిల్లలు తప్పిపోయే అవకాశం ఉంది. దీంతో వారి కోసం పడమర మెట్ల వద్ద మర్రిచెట్టు కింద సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ఈ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.



జాతరలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం

భక్తులకు లడ్డూ చేదు..

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జాతరలో ప్రసాదంగా అందించే లడ్డూ ధరలను చూస్తే భక్తులకు చేదూ అనుభవం ఎదురవుతోంది. 100 గ్రాముల లడ్డూను రూ.20, 100 గ్రాముల పులిహోర రూ.20, విక్రయించాల్సి ఉండగా 250 గ్రాముల లడ్డూను రూ.100, పులిహోర 250 గ్రాములు రూ.100కు విక్రయిస్తూ భక్తులను నిలువునా దోచుకుంటున్నారు.



కట్ట వెంట మొక్కలు నాటుతున్న సిబ్బంది

మొక్కలు నాటిన మున్సిపల్ సిబ్బంది

జాతరలోని చెరువు కట్ట పక్కన ఇరువైపులా మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటారు. రానున్న జాతరల దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సేదదీరేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



లింగమంతుల స్వామి ఆలయ సన్నిధిలో భక్తులు



స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

లింగమంతుల స్వామి ఆలయంలో జడ్జి పూజలు



జడ్జిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

చివ్వెంల (సూర్యాపేట) : దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి ఆలయంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జడ్జిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతరను సందర్శించిన అదనపు కలెక్టర్

జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదివారం రాత్రి జాతరను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఉన్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దేవరపెట్టెలో దేవతామూర్తులు వీరే..

సూర్యాపేట రూరల్ : లింగమంతులస్వామి జాతరకు ఆదివారం అర్ధరాత్రి కీలకమైన దేవరపెట్టె (చౌడమ్మతల్లి పెట్టె) పెద్దగట్టుకు చేరుకుంది. పెద్దగట్టుపై దిష్టిపూజ నిర్వహించేందుకు మహబూబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి తండ వంశస్తులు గత నెల 21న అందెనపు చౌడమ్మ పెట్టెను సూర్యాపేట మండలంలోని కేసారం గ్రామానికి తీసుకొచ్చారు. మరుసటి రోజు అర్ధరాత్రి 22వ తేదీన మెంతబోయిన, గొర్ల, రెడ్డి, మున్నా వంశస్తుల ఆధ్వర్యంలో ఊరేగింపుగా దేవర పెట్టెను గట్టుపైకి తీసుకొచ్చి అంగరంగ వైభవంగా దిష్టిపూజ నిర్వహించారు. అనంతరం మరుసటి రోజు కేసారం గ్రామానికి దేవరపెట్టెను చేర్చడంతో అప్పటి నుంచి ఉత్సవ విగ్రహాలు ఆ గ్రామంలోనే కొలువై ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి అందెనపు చౌడమ్మ పెట్టె గట్టుపైకి చేర్చడంతో జాతర ప్రారంభమైంది.

పెట్టెలో ఏముంది..

దేవరపెట్టెలో యాదవులు ఆరాధించే లింగమంతులస్వామితో పాటు 33 మంది దేవతామూర్తులు ఉన్నారు. వారిలో చౌడమ్మ, గంగమ్మ, యలమంచమ్మ, ఆకుమంచమ్మ, మాణిక్యమ్మ, ఐదుగురు రాజులు, ఐదుగురు చెంచులు, భూమినేడు, భూమసాని, వినాయకుడు, బ్రహ్మ, వరవావతారం, బొల్లావు, గొల్లబామ, వసుదేవుడు, శ్రీకృష్ణుడు, పులి, బైరవుడు, పోతరాజు, బ్రాహ్మణుడు, నారదుడు, విశ్వామిత్రుడు, అంబారిపై లింగమంతుల స్వామి, పాపనాక్షి, నాగేంద్రుడు ఉన్నారు.





జాతరలో వెలిసిన ఫ్లెక్సీలు

ఫ్లెక్సీల జాతర

జాతర నలువైపులా వివిధ పార్టీల నాయకులు తమ అభిమాన నాయకుల ఫొటోల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో జాతర ఫ్లెక్సీలమయంగా మారింది. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు.



జాతరలో వెలిసిన దుకాణాలు



బోనం, గంపతో లింగమంతులస్వామి ఆలయానికి వెళ్తున్న భక్తులు

సూర్యక్షేత్రంలో మహాసౌరహోమం



సౌరహోమంలో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని సూర్య నారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్య నారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, శ్రీనివాస శర్మ, భక్తులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్



చేనేత ఐక్య వేదిక సభ్యులతో రాపోలు వీరమోహన్

మిర్యాలగూడ టౌన్: చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడలో జరిగిన ఆ వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ఏనిమిదేళ్లకు పైగా అవుతుందని, సహకార సంఘాలను నామమాత్రం చేస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత సంక్షేమానికి కేవలం రూ.156 కోట్లు కేటాయించడం బాధాకరమన్నారు. పూర్వ క్యాష్ క్రెడిట్‌ను రద్దు చేసి కొత్తగా క్యాష్ క్రెడిట్‌లను మంజూరు చేయాలన్నారు. మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి జియోట్యాగ్ నంబర్లు ఇవ్వాలని, చట్టసభల్లో చేనేత వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్నా రాములు, రాపోలు పరమేష్, ఎలగందుల కృష్ణవేణి, జిల్లా అధ్యక్షుడు తిరందాసు వేణుగోపాల్, రాపోలు వెంకటేశ్వర్లు, కొంగరి నారాయణ, ప్రసాద్, పిల్లలమర్రి రవికుమార్, అనంద్‌కుమార్, గుర్రం శ్రీనివాస్, మిర్యాల శ్రీనివాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.